క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన డీఆర్వో, డీఈఓ


కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిసిన డీఆర్వో కేవీ నారాయణమ్మ

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా రెవెన్యూ అధికారిగా నియమితులైన కేవీ నారాయణమ్మ, జిల్లా విద్యాశాఖాధికారిగా వచ్చిన శామ్యూల్‌పాల్ శుక్రవారం వేర్వేరు సమయాల్లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయా శాఖల నిర్వహణపై కలెక్టర్ పలు సూచనలు చేశారు.

సుహాన కుటుంబానికి న్యాయం చేయాలి

కర్నూలు(సెంట్రల్): టీడీపీకి చెందిన రౌడీషీటర్ రాగి నవీన్ చేతిలో హతమైన తెనాలి యువతి సుహాన కుటుంబాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత పరామర్శించకపోవడం అన్యాయమని ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.ఇక్బాల్‌హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. నిందితుడిపై నిర్భయ చట్టాన్ని అమలు చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా ఉరిశిక్ష పడేలా చేయాలని కోరారు. అలాగే బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారంతో పాటు ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

ఏఐటీయూసీలో చేరిక

కర్నూలు(సెంట్రల్):ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమీజాబీ, సభ్యులు దస్తగిరమ్మ, రాధతోపాటు పలువురు మహిళలు ఏఐటీయూసీలో చేరారు. ఏఐటీయూసీ కార్యాలయంలో వారికి ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ, ఆ సంఘం జిల్లా, నగర కార్యదర్శులు ఎస్.మునెప్ప, జి.చంద్రశేఖర్ కండువాలు కప్పి ఆహ్వానించారు.

పెద్దాసుపత్రిలో అన్న క్యాంటీన్ ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శుక్రవారం అన్న క్యాంటీన్‌ను మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులకు క్యాంటీన్‌లో అల్పాహారం వడ్డించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని రూ.5కే అందిస్తున్నామని తెలిపారు. ఆసుపత్రికి రాయలసీమతో పాటు తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి పేదలు చికిత్స కోసం వస్తారని, అలాంటి వారికి ఈ క్యాంటీన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించారు. ఈ ఇన్‌స్టిట్యూట్‌ను పూర్తిస్థాయిలో ప్రారంభించేందుకు అవసరమైన రూ.10 కోట్ల నిధులను త్వరలో విడుదల చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, టూరిజం డైరెక్టర్ ముంతాజ్, ఆర్డీఓ సందీప్ కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ సి.ప్రభాకర్‌రెడ్డి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలి


చెస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కర్నూలు (టౌన్): జిల్లాస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని రాష్ట్ర స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భానుమూర్తిరాజు సూచించారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ -14, అండర్-17 విభాగంలో బాల బాలికలకు చెస్, యోగా పోటీలు నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ క్రీడలను ప్రతి విద్యార్థి, విద్యార్థినీ వినియోగించుకోవాలన్నారు. జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి గిడ్డయ్య, సహాయ కార్యదర్శి పరమేష్ పాల్గొన్నారు.

సరళతరంగా ఇసుక విధానం

కర్నూలు న్యూసిటీ: ఉచిత ఇసుక విధానాన్ని మరింత సరళం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మైనింగ్ శాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం జీఓ జారీ చేశారు. ఉచిత ఇసుక పాలసీపై ఈ నెల 21న జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎటువంటి రుసుము చెల్లించకుండా ఇసుకను తీసుకెళ్లేలా ఆదేశాలు ఇచ్చారు. ఇందులో భాగంగా సీనరేజ్ ఫీజు, మెరిట్ అన్‌కాండ్, డీఎంఎఫ్ మాఫీకి చర్యలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు.

రూ.10 నాణేలను వినియోగించవచ్చు

కర్నూలు(అగ్రికల్చర్): రూ.10 నాణేలను రోజువారీ లావాదేవీలకు నిర్భయంగా వినియోగించవచ్చని కలెక్టరేట్‌లోని ఎస్‌బీఐ ట్రెజరీ శాఖ చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం కర్నూలుకు చెందిన చిరు వ్యాపారులకు రూ.10 నాణేలు అందజేశారు.ఆయన మాట్లాడుతూ.. రూ.10 నాణేలను వ్యాపార, వాణిజ్యాలకు, బ్యాంకుల్లో లావాదేవీలకు, దైనందిన జీవితంలో ప్రతి ఖర్చుకు వినియోగించవచ్చన్నారు.

రసాభాసగా నగరపాలక సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

- టీడీపీ, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం
- వాటర్ వర్క్స్‌లో అవినీతిపై విజిలెన్స్ విచారణకు సభ ఆమోదం


హాజరైన ప్రజాప్రతినిధులు


మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు(టౌన్): వాదనలు, ప్రతివాదనలు, ఆరోప ణలు, ప్రత్యారోపణలు, కార్పొరేటర్ల తీవ్ర వాగ్వివాదంతో నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. మూడు గంటలకు పైగా సాగిన సమావేశంలో కార్పొరేటర్లు ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకున్నారు. వాటర్ వర్క్స్‌లో అవినీతిని తేల్చాలని కొందరు కార్పొరేటర్లు పట్టుబట్టారు. దీంతో ఆ విభాగంలో విజిలెన్స్ విచారణకు సభ ఆమోదం తెలిపింది. శుక్రవారం స్థానిక సుంకేసుల రోడ్డులోని న్యూ కౌన్సిల్ హాలులో నగర మే యర్ బీవై రామయ్య అధ్యక్షతన నగరపాలక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కమిషనర్ రవీంద్రబాబు, డిప్యూటీ మేయర్ సిద్దా రెడ్డి రేణుక పాల్గొన్నారు. మొత్తం 6 అంశాలపై చర్చించి రూ.1.85 కోట్లు విలువ చేసే పనులకు ఆమోద ముద్ర వేశారు. అంతకుముందు వ్యాపారవేత్త రతన్‌టాటా మృతికి సంతాపంగా సభలో రెండు నిముషాలు మౌనం పాటించారు. నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, అడిషనల్ కమిషనర్ కృష్ణ మున్సిపల్ ఎస్ఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వర్సెస్ వైఎస్సార్‌సీపీ

మూడు గంటల పాటు సాగిన సమావేశంలో రెండు గంటల పాటు టీడీపీ, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదమే కొనసాగింది. ముందుగా 23వ వార్డు కార్పొరేటర్ కటారి పల్లవి తమ వార్డుల్లో రోడ్డును ఆక్రమించుకొని బంకులు వెలిశాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. సి.క్యాంపు స్కూల్ వద్ద విద్యార్థినుల బాత్‌రూమ్‌ల వద్ద ఈ బంకులు ఏర్పాటు చేశారని చెప్పారు. దీనిపై సమాధానం కావాలంటూ కార్పొరేటర్ పట్టుబట్టారు. ఇదే విషయంపై సభలో గందరగోళం నెలకొంది. మీహయంలో ప్రజాప్రతినిధులు అక్రమాలు చేశారని, స్థలాలు కబ్జా చేశారని కార్పొరేటర్ పరమేష్ ఆరోపించారు. దీంతో తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. ఒకే వర్గానికి చెందిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను తప్పించారని కార్పొరేటర్లు యూనస్ బాషా, జుబేర్, షేక్ అహమ్మద్ చెప్పడంతో కొంత సేపు ఇరుపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

కార్పొరేటర్లు ఏమన్నారంటే...

- మినిట్స్ కచ్చితంగా రాయించాలని, తదుపరి సమావేశంలో ఎన్ని పరిష్కరించారో సభలోని వారికి తెలియజేయాలని కార్పొరేటర్ లక్ష్మీకాంత రెడ్డి కోరారు. పాత కల్లూరుకు వెళ్లే రహదారిలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు.
- వెంకటరమణ కాలనీలో మున్సిపల్ స్థలాలు మాయమయ్యాయని కార్పొరేటర్ రాజేశ్వర రెడ్డి చెప్పారు.
- మంత్రి టీజీ నివాసం వెనుక లైనులో ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ క్రిష్ణకాంత్ చెప్పారు.
- కుక్కల సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ శ్వేతా రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు.
- టెండర్లలో పాల్గొని అగ్రిమెంటు చేసుకున్న కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారని కార్పొరేటర్ సిత్రా సత్యనారాయణమ్మ అన్నారు.
- సి.క్యాంపు స్కూల్ వద్ద రోడ్డును ఆక్రమించి వేసిన బంకులు తొలగించాలని కార్పొరేటర్ క్రాంతికుమార్ చెప్పారు. 82 కోట్లతో చేపడుతున్న పైపులైన్ పనుల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలన్నారు.
- ప్రొటోకాల్ పాటించడం లేదని, తమ వార్డులో జరిగే పనులకు తమను పిలవడం లేదని ఆర్షియా ఫర్హీన్ చెప్పారు.
- పందుల సమస్యను పరిష్కరించాలని సుజాత అనే కార్పొరేటర్ చెప్పారు
- ఇందిరాగాంధీనగర్‌లో పనులు జరగడం లేదని కార్పొరేటర్ మణేమ్మ అన్నారు.

రూ. 1.85 కోట్ల పనులకు గ్రీన్ సిగ్నల్

- రెండు సూపరింటెండెంట్ పోస్టుల్లో వాజిద్, రామకృష్ణకు పదోన్నతి కల్పిస్తూ ఆమోదం వ్యక్తం చేశారు.
- పారిశుద్ధ్య విభాగంలో 5 పోస్టుల్లో అర్హులైన వారిని నియమించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.
- బంగారుపేటలో రూ.60 లక్షలతో రిటైనింగ్ వాల్, పబ్లిక్ టాయిలెట్స్, రహదారి నిర్మించేందుకు ఆమోదం వ్యక్తం చేశారు.
- అశోక్ నగర్‌లో గ్యాస్ సిలిండర్లు, ఫ్రీ క్లోరినేషన్ కోసం రూ.1.25 కోట్లు కేటాయించారు.

స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం

కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం, ఇప్పటికే ఆ ప్రక్రియ ప్రారంభమైంది. నగరంలో తుంగభద్ర, హంద్రీ, కేసీ కెనాల్ ప్రవహిస్తున్నా ప్రజలు మంచినీటి సమస్య ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. అనేక చోట్ల కమ్యూనిటీ భవనాల్లో సచివాలయా లు కొనసాగుతున్నాయి, పేదల కోసం నిర్మించిన ఈ భవనాలు వారికే ఉపయోగించాలి.

– మంత్రి టీజీ భరత్

కలిసికట్టుగా అభివృద్ధి చేద్దాం

కర్నూలు నగరాన్ని కలిసికట్టుగా అభివృద్ధి చేద్దాం. మంత్రి టీజీ భరత్ చొరవ తీసుకొని కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా ప్రకటిస్తే నిధుల సమస్య ఉండదు. వాటర్ వర్క్స్ విభాగంలో వచ్చిన అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ విచారణ చేయిస్తాం.

– నగర మేయర్ బీవై రామయ్య

కబ్జాలపై విచారణ జరపాలి

నగరపాలక సంస్థ పరిధిలో కొందరు పార్కు స్థలాలను ఆక్రమించుకున్నారు. వీటిపై విచారణ జరపాలి. పాణ్యం అర్బన్ వార్డుల్లో అనేక చోట్ల స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయి. కల్లూరు కాలనీలలో అనేక సమస్యలు తాండవిస్తున్నాయి. ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలి.

– పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి

ర్యాగింగ్ జరిగిందనే చెబుతున్నారు

- ప్రిన్సిపాల్‌కు నివేదిక ఇచ్చిన కమిటీ

కర్నూలు (హాస్పిటల్): పలువురు సీనియర్లు తమను వేధించారని కమిటీ సభ్యులకు కర్నూలు మెడికల్ కళాశాల జూనియర్ వైద్య విద్యార్థులు విన్నవించుకున్నారు. ఈ మేరకు వారు చెప్పిన విషయాలను కమిటీ సభ్యులు కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మకు అందజేశారు. ఇటీవల కళాశాలలో చేరిన ఫ్రెషర్స్‌ను సీనియర్లు వేధింపులకు గురిచేయడం కలకలం రేపింది. ఈ విషయం దినపత్రికల్లో రావడంతో ప్రిన్సిపాల్ స్పందించి డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ మాధవీ శ్యామల, డాక్టర్ యుగంధర్ రెడ్డిలను కమిటీ సభ్యులుగా నియమించారు. వీరు మూడు రోజుల పాటు కళాశాలలోని జూనియర్, సీనియర్ విద్యార్థులతో వేర్వేరుగా అభిప్రాయాలు తీసుకున్నారు. ర్యాగింగ్‌కు సంబంధించి వారితో విడివిడిగా మాట్లాడారు. పేర్లు లేకుండా తెల్ల కాగితంపై అభిప్రాయాలు రాయాలని ఫ్రెషర్స్‌తో లిఖితపూర్వకంగా తీసుకున్నారు. ఈ మేరకు నివేదిక తయారు చేసి ప్రిన్సిపల్‌కు అందజేశారు. నివేదికలో పొందుపరచిన అంశాలను ర్యాగింగ్ పరిధిలోకి వస్తాయా రావా అని కళాశాలలోని సీనియర్ ప్రొఫెసర్లతో ప్రిన్సిపల్ సుదీర్ఘంగా చర్చించారు. ఇదే సమయంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా ర్యాగింగ్‌పై విచారణ చేయాలంటూ ఆదేశాలు వచ్చాయి. అయితే గతంలో నియమించిన కమిటీ సభ్యులతో కాకుండా ప్రస్తుతం కొనసాగుతున్న ర్యాగింగ్ వ్యతిరేక కమిటీ సభ్యులతో విచారణ చేసి నివేదిక పంపాలని అందులో పేర్కొనడం గమనార్హం.

హామీలు అమలు చేయాలి

కర్నూలు సిటీ: ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేసేందుకు విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర సంగ్రామం పోరాటంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని, వచ్చే నెల 12, 13 తేదీల్లో 30వ జిల్లా మహాసభలను ఆదోని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆ సంఘం నాయకులు అభి, అశోక్, కె.మధు, అంజి, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వార్డుబాయ్ పోస్టులను భర్తీ చేయాలి

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వ జన వైద్యశాలలో ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓ (వార్డ్ బాయ్) స్ట్రెచర్ బేరర్ పోస్టులను భర్తీ చేయాల ని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.బాలస్వామి నాయక్ మంత్రి టీజీ భరత్‌కు వినతిపత్రం అందించారు. శుక్రవారం ఆసుపత్రిలో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు వచ్చిన మంత్రిని ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో 1500కు పైగా పడకలు ఉన్నాయని, ఈ సంఖ్యను బట్టి నర్సింగ్ స్టాఫ్ 650 మంది, శానిటేషన్ వర్కర్లు 350 మంది, సెక్యూరిటీ గార్డులు 250 మంది ఉన్నారన్నారు. కానీ ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓలు, స్ట్రెచర్ బేరర్లు వంద మంది కూడా లేరన్నారు. ఈ కారణంగా ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, ఓపీలలో ఒక్కొక్కరూ నా లుగైదు చోట్ల విధులు నిర్వహించాల్సి వస్తోందన్నారు. రోగులను వారితో వచ్చిన సహాయకు లే స్ట్రెచర్‌పై తీసుకెళ్లాల్సి వస్తుందన్నారు. వెంటనే పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

నేడు అక్బర్‌బాషా సంస్మరణ సభ

కర్నూలు కల్చరల్: కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ రంగస్థల కళాకారుడు అక్బర్ బాషా సంస్మరణ సభను నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.మనోహర్‌బాబు తెలిపారు. శనివారం సాయంత్రం 6.30 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో నిర్వహించే కార్యక్రమంలో నారద ఏకపాత్రాభినయం, శ్రీకృష్ణతులాభారం నాటకంలోని శ్రీకృష్ణ పడక శీను, భవాని చింతామణి సీను లాంటి పౌరాణిక పద్య నాటకాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

బ్రిడ్జి నిర్మించకపోతే రోడ్లు దిగ్బంధిస్తాం


ఎస్ఈకి వినతి పత్రం ఇస్తున్న ఆందోళనకారులు

కర్నూలు న్యూసిటీ: కర్నూలు–ఉల్చాల రహదారిలో కూలిపోయిన బ్రిడ్జిని వెంటనే నిర్మించకపోతే రహదారులు దిగ్బంధిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ హెచ్చరించారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నగరంలోని రోడ్లు, భవనాల శాఖ కార్యాలయంలో సీఐటీయూ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి ఎస్ఈకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలు నుంచి ఉల్చాల, రేమట మీదుగా మంత్రాలయం వెళ్లే రహదారిలో వాగు వద్ద బ్రిడ్జి కూలిపోయి సంవత్సరాలుగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ఈ విషయంపై ఎస్ఈ స్పందిస్తూ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, బ్రిడ్జి మంజూరై నిధులు రాగానే నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు.

నవజాత శిశువుకు అరుదైన చికిత్స


కోలుకున్న శిశువు, తల్లితో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): ఏడో నెలలో కేవలం 900 గ్రాముల బరువుతో జన్మించిన శిశువుకు కర్నూలు అశ్విని హాస్పిటల్ వైద్యులు మెరుగైన వైద్యంతో పునర్జన్మ అందించారు. చికిత్స వివరాలను శుక్రవారం చిన్నపిల్లల వైద్యుడు నాగేశ్వరరెడ్డి, డాక్టర్ వీరరత్నాకర్‌రెడ్డి వివరించారు. స్థానిక ఎస్ఆర్ పేటకు చెందిన రంజిత మొదటి కాన్పు కోసం ఇటీవల అశ్విని హాస్పిటల్‌లో చేరింది. ఆమెకు బీపీ ఎక్కువగా ఉండటంతో గత నెల 20న వైద్యులు అత్యవసరంగా ఏడో నెలలోనే సిజేరియన్ ద్వారా కాన్పు చేశారు. శిశువు 930 గ్రాముల బరువు మాత్రమే ఉంది. ఐదు రోజుల తర్వాత మరింత తగ్గి 820 గ్రాములకు చేరింది. దీంతో పాటు ఆయాసం, ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ మొదలు కావడంతో ఒక రోజు వెంటిలేటర్ అమర్చి, అనంతరం అవసరమైన మందులు, పోషకాహారం ఇస్తూ వైద్యులు చికిత్స అందించారు. నెలరోజుల తర్వాత శిశువు పూర్తిగా కోలుకోవడంతో శుక్రవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. మెరుగైన వైద్యం అందించిన డాక్టర్లకు బాలింత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


ప్రతిభ కనబరిచిన ఇంజినీరింగ్ విద్యార్థులను అభినందిస్తున్న ఆర్‌యూ వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: విద్యార్థులు చదువుతో పాటు ఇతర అంశాల్లోనూ రాణించాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ సూచించారు. స్థానిక జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జిజ్ఞాస – 2కే24 కార్యక్రమంలో భాగంగా ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించిన పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీల్లో ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి సాధించిన వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ మూడవ సంవత్సరం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ కళాశాలల నుంచి మొత్తం 23 బృందాలు పోటీల్లో పాల్గొనగా ఆర్‌యూ విద్యార్థులు సీహెచ్ మనీష్‌కుమార్, బి.ధరణి, సి.నవీన్ విజేతలుగా నిలిచి రూ.3 వేలు నగదు బహుమతి సాధించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్ నాయుడు, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.హరిప్రసాదరెడ్డి, ఈసీఈ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ శరత్‌తో పాటు వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన ఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్): బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రామలింగం, ఎల్.విజయభాస్కర్ డిమాండ్ చేశారు. బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్, ఆలిండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్, క్యాజువల్ కాంట్రాక్టు వర్కర్స్ ఫెడరేషన్ సంయుక్త సమన్వయ కమిటీ న్యూఢిల్లీ వారు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం కర్నూలులోని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద పలు డిమాండ్ల సాధనకై ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రామలింగం, విజయభాస్కర్ మాట్లాడుతూ 2017 నుంచి 15 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ, పెన్షన్ సవరణ చేయాలన్నారు. 49/59 సర్వీసులను వెంటనే ప్రవేశపెట్టాలని కోరారు. క్యాజువల్, కాంట్రాక్టు సిబ్బందికి కనీసం వేతనం అమలుచేయాలని పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం వెంటనే కల్పించాలన్నారు. రెండవసారి వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ ప్రతిపాదనను వెంటనే విరమించాలని కోరారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.మద్దిలేటి, సర్కిల్ అధ్యక్షుడు ఎం.యాకోబు, సర్కిల్ సహాయ కార్యదర్శి జి.మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రాలో జిల్లాకు ప్రథమ స్థానం


విజేతగా నిలిచి ట్రోఫీ, మెడల్స్ అందుకుంటున్న కర్నూలు జిల్లా జట్టు

కర్నూలు (టౌన్): శ్రీకాకుళం పట్టణంలో ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించిన 34వ రాష్ట్రస్థాయి సీనియర్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీలో జిల్లా పురుషుల జట్టుకు ప్రథమ స్థానం, మహిళా జట్టుకు 3వ స్థానం దక్కిందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషుల ఫైనల్ పోటీల్లో కోనసీమ జట్టుపై కర్నూలు 2–0 స్కోర్‌తో ఘన విజయం సాధించి బంగారు పతకం కైవసం చేసుకుంది. జట్టులో శివకుమార్, మధుబాబు, వీరాంజనేయులు అద్భుత ఆట తీరును ప్రదర్శించి జట్టు విజయానికి కృషి చేశారని తెలిపారు.

29న సివిల్ సర్వీస్ ఉద్యోగులకు ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు ఈనెల 29న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.భూపతి రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బెస్ట్ ఫిజిక్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, ఖోఖో, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, రెజ్లింగ్, యోగా క్రీడాంశాలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీలో పాల్గొనే ఉద్యోగులు ఐడీ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. ప్రతి ఉద్యోగి రెండు క్రీడాంశాల్లో కంటే ఎక్కువగా పాల్గొనరాదని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 6 నుంచి 9వ తేదీ వరకు విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు (సెంట్రల్): కర్నూలు జిల్లా ఆర్టీసీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో పాటు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై క్రమ పద్ధతిలో ముందుకు వెళ్తున్నట్లు మంత్రి టీజీ భరత్ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులుతో పాటు ఇతర అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కర్నూలు జిల్లాలో ఆర్టీసీ బస్టాండ్ల పరిస్థితి గురించి ఆరా తీశారు. ఆర్టీసీ స్థలాల అభివృద్ధికి నివేదిక రూపొందించాలని సూచించారు. ప్రయాణికుల సౌకర్యార్థం చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కర్నూలు బస్టాండ్, ఆదోని, ఆలూరు, మంత్రాలయంలో గల ఖాళీ స్థలాలను ఓఎస్–15 ప్రకారం టెండర్లు పిలిచి అభివృద్ధి చేయడంతో పాటు ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు మంత్రికి వివరించారు. తక్కువ దూరం ప్రయాణాలు సాగే రూట్లలో ఎలక్ట్రిక్ బస్సులు తీసుకురావడంపై సమావేశంలో చర్చించారు. కర్నూలు డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ శ్రీ హరినాథ్‌బాబు, కర్నూలు–1, కర్నూలు–2 డిపో మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని బి.తాండ్రపాడులో గ్రామస్తుల సహకారంతో శివాలయ నిర్మాణం జరుగుతుండగా శుక్రవారం వడ్ల శంకరయ్య అనే వ్యక్తి తన ఇంటి పక్కనున్న శివాలయంలో నంది విగ్రహాన్ని ధ్వంసం చేసి, ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నం చేశాడని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ నాయకుడు టి.ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని తాలుకా పోలీసులు వెంటనే ఆధీనంలోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న భజరంగ్ దళ్ ప్రతినిధి బృందం గ్రామానికి చేరుకొని ఆలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడారు. వడ్ల శంకరయ్య హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని, అలాగే ఆలయ నిర్మాణానికి అడ్డు చెప్పకూడదని వారు డిమాండ్ చేశారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు, భజరంగ్‌దళ్ నాయకులు శివసాయినాథ్, రాంబాబు, ప్రకాష్ సింగ్, మనోహర్, సింహాద్రి ఆచారి తదితరులు పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన విద్యార్థి నాయకులు


డీఈఓ శామ్యూల్ పాల్‌ను అభినందనలు తెలుపుతున్న ఎస్టీయూ నాయకులు

కర్నూలు సిటీ: జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.శామ్యూల్ పాల్‌ను శుక్రవారం పలు విద్యార్థి, ప్రజా, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజీవ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, రాయలసీమ యూనివర్సిటీ విభాగం అధ్యక్షుడు రామకృష్ణ కలిసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకారి, జనార్ధన్, రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి తిమ్మన్న సైతం కలిసి అభినందనలు తెలిపారు.